క్లుప్తంగా

కొవ్వలిలో సెమీక్రిస్మస్ వేడుకలు



భక్తి గీతాలను విడుదల చేస్తున్న డివిజనల్ కమాండర్ కె.మోషే, మేజర్ జి.మేరికుమారి

దెందులూరు: కొవ్వలి సాల్వేషన్ ఆర్మీ చర్చిలో కోర్ ఆఫీసర్ మేజర్ కె.సుబ్బారావు, కె.మేరి కుమారి ఆధ్వర్యంలో సెమీక్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. కొవ్వలితో పాటు సమీప గ్రామాల్లో భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. క్రిస్మస్ కేక్‌ను డివిజనల్ కమాండర్ కె.మోషే, జి.మేరికుమారి కట్ చేశారు. కోర్ ఆఫీసర్ కుమార్తె గానం చేసిన సెమీక్రిస్మస్ గీతాల డిస్క్‌ను వారు విడుదల చేశారు. వేడుకల్లో సంఘ సభ్యులు, ఇతర గ్రామాల నుంచి వచ్చిన విశ్వాసులు, పూర్వ సమితి సభ్యులు, సంఘస్తులు, చిన్నారుల సమక్షంలో క్రిస్మస్ కేక్‌ను కట్ చేశారు.

ధాన్యాన్ని మిల్లులకు తరలించాలి



రైతులతో మాట్లాడుతున్న ఆర్డీఓ అచ్యుత్ అంబరీష్

దెందులూరు: కొవ్వలి, దోసపాడు, పోతునూరు గ్రామాల్లో ఏలూరు ఆర్డీఓ అచ్యుత్ అంబరీష్ ఆదివారం పర్యటించారు. తుపాన్ నేపథ్యంలో రైతులతో ముఖాముఖి నిర్వహించారు. వెంటనే ధాన్యం మిల్లులకు తరలించాలని తరలించకపోతే నష్టం వాటిల్లుతుందని రైతులకు సూచించారు. ధాన్యం కొనుగోలు, గోనె సంచుల సరఫరాలో ఇబ్బందులుంటే తెలియజేయాలని రైతులను కోరారు. రైస్ మిల్లులకు వెళ్లి రికార్డులు పరిశీలించారు. మిల్లర్లకు పలు సూచనలు చేశారు. ఆర్డీఓ వెంట దెందులూరు తహసీల్దార్ బి.సుమతి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ హేమమాలని, వీఆర్వోలు రామకృష్ణ, రామచంద్రరావు ఉన్నారు.

5న మన్నా చర్చిలో సెమీ క్రిస్మస్ వేడుకలు



సెమీ క్రిస్మస్ వాల్‌పోస్టర్‌ను విడుదల చేసిన పాస్టర్లు

దెందులూరు: స్థానిక మన్నా చర్చిలో ఈనెల 5న సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించనున్నట్టు పాస్టర్ బెంజిమెన్ తెలిపారు. ఆదివారం సంఘస్తులతో కలిసి సెమీ క్రిస్మస్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆయన విడుదల చేశారు. విశ్వాసులంతా సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని క్రీస్తు ఆశీస్సులు పొందాలని ఆయన కోరారు.

ఉత్తమ సేవలతో గుర్తింపు

దెందులూరు: ఫొటోగ్రాఫర్లు వినియోగదారులకు నాణ్యమైన, ఉత్తమ సేవలు అందించి గుర్తింపు పొందాలని ఏలూరు ఫోటో ట్రేడ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మెగా దుర్గారావు అన్నారు. ఆదివారం గోపన్నపాలెంలో అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన నిర్వహించారు. ఫొటోగ్రాఫర్ల సమస్యల పరిష్కారానికి యూనియన్ కార్యవర్గం కృషి చేస్తుందని నాయకులు స్పష్టం చేశారు.

ఘనంగా జ్యోతిర్లింగార్చన

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక దొండపాడు బాల అయ్యప్ప క్షేత్రంలో కార్తీక మాస ముగింపు సందర్భంగా ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం స్వామి వారికి అభిషేకాలు నిర్వహించి భక్తుల గోత్రనామాలతో అష్టోత్తర పూజలు నిర్వహించారు. రాత్రి క్షేత్రం ప్రాంగణంలో జ్యోతిర్లింగార్చన అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు కార్యక్రమాలు పర్యవేక్షించారు.

పత్తేబాదలో భారీ అన్న సమారాధన

స్థానిక పత్తేబాద చౌడేశ్వరి రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహించిన కార్తీక మాసోత్సవాల ముగింపు సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి విశేష అభిషేకాలు, అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్నసమారాధనలో సుమారు 10 వేల మంది భక్తులు పాల్గొన్నారు.

సమాజ సేవలతో జన్మ ధన్యం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రతి మనిషి దేవుని భక్తిలో నీతిగా జీవిస్తూ, సమాజ సేవ చేసి తమ జన్మ ధన్యం చేసుకోవాలని స్థానిక అమలోద్భవి కెథడ్రల్ విచారణ గురువు ఫాదర్ ఇంజమాల మైఖేల్ అన్నారు. ఆదివారం స్థానిక అమలోద్భవి కెథడ్రల్‌లో ఫాదర్ మైఖేల్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. అనంతరం ఫాదర్ మైఖేల్ మాట్లాడుతూ సమాజంలోని ప్రతీ ఒక్కరినీ ప్రేమించాలని, సాటి వారిని ఆదుకోవాలని ఏసు ప్రభువు చెప్పారన్నారు. ఈ సందర్భంగా పలువురు పేదలకు, వృద్ధ మహిళలకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏలూరు నగర పాస్టర్స్ ఫెలోషిప్ ప్రతినిధులు ఎబినేజర్ శాస్త్రి, ఎం.జోయతిరాజు, ఫాదర్ విద్యా సాగర్, డీ.అబ్రహం, జే. బెనర్జీ, విశ్వాసులు పాల్గొన్నారు.

గడ్డికి నిప్పు.. భూసారానికి పెనుముప్పు

- గడ్డిని పొలాల్లో కాల్చకుండా కలిపి దున్నేద్దాం
- యంత్రాలతో గడ్డిని సేకరిస్తే పశువులకు అందుబాటులో దాణా



దెందులూరులో పొలంలో ఎండుగడ్డికి నిప్పు పెట్టిన దృశ్యం

దెందులూరు: ఖరీఫ్, రబీ సీజన్‌లో అనేక మంది రైతులు వరికోత యంత్రాలనే వినియోగిస్తున్నారు. రబీ సీజన్ కంటే ఖరీఫ్ సీజన్‌కు లభించే గడ్డినే ఎక్కువగా పశువులకు దాణాగా ఉపయోగించడం రైతులకు అలవాటు. ఖరీఫ్ సీజన్‌లో లభించే గడ్డికి డిమాండ్ ఎక్కువగా ఉన్నా కోత యంత్రాల వల్ల వాటి లభ్యత అంతంతమాత్రంగా ఉంటుంది. పొలాల్లో గడ్డి నలిగిపోవడం వల్ల పశువులకు పనికి రాదన్న ఉద్దేశంతో ఎండుగడ్డిని పొలాల్లోనే రైతులు తగులబెడుతున్నారు. దీని వల్ల భూసారానికి తీవ్ర నష్టం కలుగుతుందని, దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. ఆ గడ్డిని పొలంలోనే ఉంచి దమ్ము సమయంలో కలిపి దున్నడం ద్వారా భూమికి మేలు చేకూరుతుందని వారంటున్నారు. ఇటీవల అందుబాటులోకి వచ్చిన స్ట్రాబేలర్ యంత్రాలను వినియోగించి ఎండుగడ్డిని సంరక్షించుకోవాలని సూచిస్తున్నారు. పొలాల్లో నలిగిన గడ్డిని యంత్రం ద్వారా మోపులుగా సేకరించి పశుగ్రాసంగా వినియోగించవచ్చునని వ్యవసాయ శాఖాధికారులు చెబుతున్నారు. స్ట్రాబేలర్ యంత్రాన్ని వినియోగించి గడ్డిని సేకరించడం ద్వారా రైతులకు కొద్దిమేర ఆదాయం లభిస్తుంది. వరికోత యంత్రాల ద్వారా లభ్యమైన గడ్డిని ఏదో విధంగా సద్వినియోగం చేసుకోవాలే తప్ప కాల్చడం సరికాదని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాఖ

జిల్లాలో 1.69 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ సీజన్‌లో వరి సాగవుతుంది. ఇప్పటికే సుమారు 70 శాతం మేర వరి కోతలు పూర్తయ్యాయి. ఇటీవల వరికోత యంత్రాలతో మసూళ్లు చేయడం వల్ల గడ్డి పనికిరాకుండా పోతోంది. కోత కోసినప్పుడు గడ్డి నలిగిపోతుందని, మట్టి అంటుకోవడంతో పశువులు ఆ గడ్డిని తినేందుకు అంతగా ఇష్టపడవని భావిస్తున్న రైతులు పొలాల్లోనే తగులబెట్టడం పరిపాటిగా మారింది. ఈ గడ్డి తగులబెట్టినప్పుడు వేడిగాలులతో సమీపంలోకి ప్రజలు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సి వస్తోంది. మంటలు ఒక పొలం మీదుగా మరొక పొలానికి వ్యాపిస్తూ ధాన్యం రాశులతో పాటు పొలాల్లో దిమ్మలపై ఉంచిన గడ్డివాములకు నిప్పంటుకుని కాలి బూడిదైన ఘటనలు గతంలో ఎన్నో చోటు చేసుకున్నాయి. గడ్డిని తగులబెట్టకుండా దమ్ములో కలిపి దున్నడం ద్వారా అనేక ప్రయోజనాలున్నాయని వ్యవసాయశాఖాధికారులు అంటున్నారు. గడ్డిని కాల్చకుండా దున్నడం ద్వారా కలిగే ప్రయోజనాలు, నేలకు సంభవించే భూసారం నష్టం వివరాలపై రైతులకు అవగాహన కల్పిస్తూ ఇప్పటికే వ్యవసాయశాఖ సదస్సులను ఏర్పాటు చేసింది.

మురగడ దమ్ముతో ఫలితం

ఆరోగ్యవంతమైన భూమిలోని ఒక గ్రాము మట్టిలో అత్యధికంగా సూక్ష్మజీవులు ఉంటాయి. భూమిలో కుళ్లిన పదార్థాన్ని ఇవి ఆహారంగా తీసుకుని మొక్కలకు అవసరమైన సూక్ష్మ పోషకాలను అందిస్తుంటాయి. పొలాల్లోని గడ్డిని కాల్చివేయడం వల్ల ఈ సూక్ష్మజీవులు చనిపోయి భూసారానికి తవ్ర నష్టం వాటిల్లుతుంది. ఇలాంటి పరిస్థితుల వల్ల గతంలో రైతులు ఎప్పుడూ వినియోగించని జింకు, బోరాన్ తదితర చిన్న చిన్న సూక్ష్మ పోషకాలను పొలాల్లో నేరుగా వేయాల్సి వస్తోంది.

దున్నడం ద్వారా భూసారానికి మేలు



పొలాల్లో గడ్డిని తగులపెట్టడం చాలా పెద్ద పొరపాటని రైతులు తెలుసుకోవాలి. దీనివల్ల సూక్ష్మ జీవులు చనిపోయి భూసారం తగ్గిపోతుంది. పొలాల్లో పడి ఉన్న గడ్డితో కలిపి దమ్ము చేయడం ద్వారా భూసారం పెరుగుతుంది. మొక్కలకు అవసరమైన పోషకాలు సంవృద్ధిగా లభిస్తాయి. పొలంబడి కార్యక్రమాల్లో ఈ విషయంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

– సుబ్బారావు, వ్యవసాయ శాఖ ఏడీ

వైభవంగా లక్ష బిల్వార్చన



గుండుగొలను శివాలయంలో లక్ష బిల్వార్చన

భీమడోలు: కార్తీక మాసోత్సవాల్లో భాగంగా చివరి ఆదివారం శైవక్షేత్రాలు శివనామస్మరణతో మార్మోగాయి. గుండుగొలను, పూళ్ల, భీమడోలు, అంబర్‌పేట, పోలసానిపల్లిలో స్వయంభువుగా వెలిసిన స్వామి వార్లకు ప్రత్యేక పూజలు చేసారు. గుండుగొలనులోని భ్రమరాంబికా మల్లేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారికి పంచామృత నవరస ఫలాభిషేక, లక్ష బిల్వార్చన పూజలు చేశారు. స్వామి, అమ్మవార్లకు దివ్య కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. భీమడోలులోని పార్వతీ సమేత భీమేశ్వర స్వామి ఆలయంలో పూజారుల ఆధ్వర్యంలో అభిషేకాలు, పూజలు ఘనంగా నిర్వహించారు.

ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

గణపవరం: ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మించడానికి ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా కృషి చేయాలని జిల్లా పీఎంపీ అసోసియేషన్ అధ్యక్షుడు ఏఆర్‌కే పరమేశ్వర్లు అన్నారు. ఆదివారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా గణపవరం మండల పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎయిడ్స్ వ్యతిరేక ప్రదర్శన, అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి అంటువ్యాధి కాదని, అంటించుకునే వ్యాధి అన్నారు.అనంతరం ఎయిడ్స్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల పీఎంపీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.సత్యనారాయణమూర్తి, ప్రధాన కార్యదర్శి శివశ్రీనివాసరావు, సభ్యులు అప్పారావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

హెచ్ఐవీ అంటువ్యాధి కాదు

దెందులూరు: హెచ్ఐవీ అంటువ్యాధి కాదని, అంటించుకునే వ్యాధి అని దెందులూరు బీఆర్‌డీ నర్సింగ్ కళాశాల కరస్పాండెంట్ సుగ్గిశెట్టి నూకరాజు అన్నారు. ఆదివారం దెందులూరు నర్సింగ్ కళాశాలలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా హెచ్ఐవీ మృతులకు నివాళులర్పించారు. హెచ్ఐవీ ఆకారాన్ని ప్రతిబింబిస్తూ అవగాహన ప్రదర్శన నిర్వహించారు.



గణపవరం: అవగాహన ప్రదర్శన నిర్వహిస్తున్న పీఎంపీ అసోసియేషన్ సభ్యులు

ఎయిడ్స్ రహిత సమాజ స్థాపనలో భాగస్వాములు కావాలి

భీమడోలు: ఎయిడ్స్ రహిత సమాజ స్థాపనలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ రష్మి అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రం, ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఐసీటీసీ కౌన్సిలర్ సీహెచ్ సింహాద్రి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. శ్రీవేంకటేశ్వర జూనియర్, డిగ్రీ కళాశాలలకు చెందిన విద్యార్థినులు ప్లకార్డులతో వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కౌన్సిలర్ సీహెచ్ సింహాద్రి, ల్యాబ్ టెక్నీషియన్ కవిత, అప్పారావు, సిబ్బంది స్వర్ణ, పరదేశి, రక్త నిల్వ సిబ్బంది పాల్గొన్నారు.

అపార్ నమోదులో విద్యార్థులకు ఇక్కట్లు

భీమడోలు: అపార్ ఐడీ నమోదు విద్యార్థుల పాలిట శాపంగా మారింది. విద్యార్థులు జనన ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డుల్లోని చిన్నపాటి తప్పులు కారణంగా ఆ విద్యార్థుల చదువులకు ఆటంకంగా మారింది. దీనితో విద్యార్థులు ఒక ఏడాది చదువును కోల్పోవాల్సిన దుస్థితి నెలకొంది. ఈనెల 8వ తేదీ నుంచి నిర్వహించనున్న డిగ్రీ సెమిస్టర్ పరీక్షలకు వారు దూరమయ్యే పరిస్థితి నెలకొంది. వివరాల్లోకి వెళ్లితే... భీమడోలు వేంకటేశ్వర డిగ్రీ కళాశాలలో భీమడోలు శివారు సూర్యారావుపేటకు చెందిన నోకిరెడ్డి నాగేంద్ర అనే విద్యార్థి బీకామ్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. ఈనెల 8న నిర్వహించనున్న డిగ్రీ సెమిస్టర్ పరీక్షల నేపథ్యంలో ఆ విద్యార్థి ఆధార్, పదో తరగతి, ఇంటర్ ధ్రువీకరణ పత్రాలను డిగ్రీ కళాశాల యాజమాన్యానికి అందజేసారు. అయితే సెమిస్టర్ పరీక్షలకు కళాశాల యాజమాన్యం విద్యార్థి నుంచి పరీక్ష ఫీజును వసూలు చేసి నన్నయ విశ్వవిద్యాలయానికి చెల్లించింది. పరీక్షల నేపథ్యంలో దరఖాస్తులను అందించే క్రమంలో అతని పదో, ఇంటర్ సర్టిఫికెట్లలో ఇంటి పేరు నోకిరెడ్డికి బదులుగా నూకిరెడ్డి పడింది. ఆధార్ కార్డులో నోకిరెడ్డి అని నమోదైంది. దీనితో వేర్వేరుగా వివరాలు ఉండడంతో అసలు చిక్కు ఏర్పడింది. ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికెట్లతో వేర్వేరుగా ఇంటిపేరు నమోదు కావడంతో అతని దరఖాస్తును యూనివర్సిటీ వారు తిరస్కరించారు. దీనితో అతను సెమిస్టర్ పరీక్షలకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడడంతో కళాశాల యాజమాన్యం తలలు పట్టుకుంది. తప్పులు సరిచేసుకునేందుకు నెలలుగా తరబడి మీసేవ కేంద్రాలకు తిరుగుతు న్నా ఆ పని పూర్తి కావడం లేదని విద్యార్థి తల్లిదండ్రులు తెలిపారు. ఇదీ ఉండగా అదే కళాశాల డిగ్రీ బీఏ చదువుకుంటున్న కె.మంజూశ్రీ జనన ధ్రువీకరణ పత్రంలో వయస్సు తప్పుగా నమోదు కావడంతో సరి దిద్దుకునేందుకు నానా అవస్థలు పడుతోంది. కళాశాలలోని ఇద్దరు ఈ విద్యార్థులు చదువుపై తీవ్ర ప్రభావం చూపుతుందని మనోవేదన చెందుతున్నారు. సోమవారం ఏలూరులోని కలెక్టర్‌ను కలిసి తమ సమస్యను తెలియజేసేందుకు వారు వెళ్లనున్నారు. ప్రిన్సిపల్ బొమ్ము రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థుల ఆధార్, సర్టిఫికెట్లు, జననధ్రువీకరణ పత్రాల్లో లోపాల వల్ల ఇబ్బందులు పడుతున్నారన్నారు. యూనివర్సిటీ అధికారులు విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఈ సారి పరీక్షలకు అవకాశం ఇవ్వాలని కోరామన్నారు.

మహిళల ఆర్థిక స్వావలంబనతోనే ప్రగతి

భీమడోలు: మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించడం ద్వారా కుటుంబాలు బలోపేతమై ప్రగతి సాధిస్తాయని ఏలూరు జిల్లా శ్రీసత్యసాయి సేవా సంస్థల అధ్యక్షుడు శశిశేఖర్‌రావు అన్నారు. భీమడోలు సత్యసాయి సేవా సమితి, హైదరాబాద్ గ్రామీణ ఔత్సాహికుల అభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో 82 మంది యువతులకు 37 రోజుల పాటు మగ్గం, జర్దోసిలో శిక్షణ అందించారు. శిక్షణ ముగింపు సందర్భంగా వారికి ధ్రువీకరణ పత్రాలు, బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమం ఆదివారం భీమడోలు అమ్మవార్ల ఆలయాల ప్రాంగణం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కన్వీనర్ వర్దనేడి సత్యసాయి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా సత్యసాయి రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌చార్జి కె.నాగప్రసాద్, జిల్లా అధ్యక్షుడు కె.శశిశేఖరరావు, ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి తదితరులు పాల్గొని ప్రసంగించారు. మహిళా సాధికారతే లక్ష్యంగా స్వచ్ఛంద సేవా సంస్థలు ఇలాంటి కార్యక్రమాలను చేపట్టడం చాలా సంతోషదాయమన్నారు. సామాజిక కార్యక్రమాలను చేపడుతూ మహిళల్లో ఆత్మస్థైర్యాన్ని నింపుతున్న సత్యసాయి సేవా సంస్థల సేవలను కొనియాడారు. శిక్షణలో నేర్చుకుని మెలకువలను, పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని స్వయం ఉపాధి కార్యక్రమాలను చేపట్టాలని కోరారు. స్వయం ఉపాధి కార్యక్రమాలకు బ్యాంకర్లు తమ వంతు రుణ సహాయం అందిస్తారని పేర్కొన్నారు. ఫ్యాకల్టీ అనూష సేవలను అభినందించారు. అనంతరం శిక్షణ పొందిన మహిళలకు ధ్రువీకరణ పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సేవాదళ్ కోఆర్డినేటర్ వెంకటేశ్వరరావు, కార్యదర్శి తనూజ, సబ్ జోన్ కన్వీనర్ సత్యనారాయణ, యూనియన్ బ్యాంకు, కెనరా బ్యాంకు మేనేజర్లు, సేవా సమితి ప్రతినిధులు యలమర్తి సత్తిబాబు పాల్గొన్నారు.



భీమడోలులో మహిళలకు శిక్షణ అందించిన అనూషను సత్కరిస్తున్న సత్యసేవా సమితి ప్రతినిధులు, అధికారులు



శిక్షణ పొందిన మహిళలతో సత్యసాయి సేవాసంస్థల సభ్యులు

వరుణుని ప్రతాపంతో అన్నదాతల్లో గుబులు

భీమడోలు: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల చేతికి వచ్చిన వరి పంటను ఒబ్బిడి చేసుకునే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. ఆదివారం కూడా వర్షం కురవడంతో అన్నదాతల గుండెల్లో గుబులు మరింత పెరిగింది. ఆరుగాలం శ్రమించి పండించిన పంటపై వరుణుడు తన ప్రతాపం చూపుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే యంత్రాలతో కోసిన వరి ధాన్యంలో తేమశాతం ఎక్కువగా ఉండడంతో వాటిని ఆరబెట్టుకునేందుకు రైతులు ఆ ధాన్యాన్ని రోడ్లపైకి తెచ్చారు. అయితే వర్షాల వల్ల ధాన్యం తడిసి మరింత నష్టం వాటిల్లకుండా రైతులు బస్తాల్లో నింపి నెట్టుకట్టి వాటిపై బరకాలు కప్పుకున్నారు. బరకాలు అందుబాటులో ఉంచామని అధికారులు చెబుతున్నా ఆచరణలో అమలు కావడం లేదని రైతులు వాపోయారు. దీనితో వారి వద్ద గల ఎరువుల బస్తాల సంచులతో బరకాలు కుట్టించుకుని వాటినే ధాన్యం రాశులపై కప్పుకుంటున్నారు. దీంతో పచ్చి ధాన్యాన్ని అయినకాడికి అమ్ముకునే పరిస్థితి ఏర్పడింది. దళారులకు ఈ వర్షాలు మేలు చేస్తున్నాయి. వర్షాలు ఇలానే కొనసాగితే ఉన్న తీవ్రంగా నష్టపోతామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



భీమడోలు ఉన్నత పాఠశాల రోడ్డులో బరకాలు కప్పి ఉంచిన ధాన్యం బస్తాలు



రావులపర్రు ఆయకట్టులో ధాన్యాన్ని బరకాలతో కప్పిన దృశ్యం

తుఫాన్ ప్రభావంతో రైతులు ఆందోళన

ఉంగుటూరు : తుఫాన్ ప్రభావంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆదివారం ఉదయం నుంచి వర్షపు జల్లులు పడ్డాయి. దాంతో ధాన్యం తడిసిపోకుండా రైతులు ఒబ్బిడి చేసే పనుల్లో నిమగ్నమయ్యారు. ధాన్యం రాశులను టార్పాలిన్లు, బరకాలు కప్పారు. ఇప్పటికే పంట ఒబ్బిడి చేసుకున్న రైతులు ఊపిరి పీల్చుకున్నారు. శనివారం రాత్రి, ఆదివారం ఉదయం నుంచి ఈదురుగాలులు వర్షపు జల్లులు పడ్డాయి. ఎ.గోకవరం, కైకరం, తిమ్మయ్యపాలెం, రావులపర్రు, కాగుపాడు, కాకర్లమూడి ఆయకట్టు ప్రాంతాల్లో రైతులు ధాన్యం రాశులను బరకాలతో కప్పారు. భారీ వర్షం లేకపోవడంతో వారంతా ఊపిరి పీల్చుకున్నారు. తహసీల్దారు పూర్ణ చంద్రప్రసాదు తన కార్యాలయంలోనే ఉండి మండలంలోని పరిస్థితిని సమీక్షిస్తున్నారు. వీఆర్వోలను అప్రమత్తం చేశారు. తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని, తేమ శాతం 17 నుంచి 25 శాతానికి సడలించినట్టు శనివారం పర్యటనలో జేసీ ధాత్రిరెడ్డి రైతులకు తెలియజేశారు.

నిర్మలమైన భక్తికి ప్రతీక 'కార్తీకం'

- నేటితో ముగిసిన కార్తీక మాసోత్సవం
- పోలి స్వర్గం పూజలకు సిద్ధమైన భక్తులు
- నియోజకవర్గంలో శివకేశవ ఆలయాల్లో ప్రత్యేక పూజలు

నిడమర్రు: హరిహరులకు ఇష్టమైన కార్తీక మాసం ఎంతో విశిష్టమైనదని, ఈ మాసంలో ప్రతి రోజూ పుణ్యప్రదమని పురాణాలు చెబుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఉన్న శివకేశవ ఆలయాల్లో ఈ నెలంతా దైవారాధనలు, దీపారాధనలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అయితే 'పోలి స్వర్గం' తెలుగు వారికే ప్రత్యేకం. నిర్మలమైన భక్తికి, ప్రకృతి ఆరాధనకు ప్రతీక అయిన దీపారాధనకూ ఉన్న ప్రాధాన్యాన్ని ఈ సంప్రదాయం చాటి చెబుతుంది. శనివారంతో కార్తీక మాసం పూజలు ముగిసాయి. ఆదివారం మధ్యాహ్నం వరకూ అమావాస్య రావడంతో కార్తీకమాసం చివరిరోజైన మార్గశిర శుద్ధ పాడ్యమి సోమవారం వేకువజాము నుంచి పోలి స్వర్గానికి సాగనంపేందుకు మహిళా భక్తులు సిద్ధమయ్యారు.

ముగింపులో దీపారాధన

ఈ మాసం ముగింపు సందర్భంగా వత్తులతో దీపాలను వెలిగిస్తారు. అలాగే భగవంతుని ముందు ఉసిరికాయలపై దీపాలను వెలిగించడం సంప్రదాయంగా వస్తోంది. కార్తీక అమావాస్య రోజున మహిళలు వేకువజామునే లేచి దేవాలయాల్లో పూజలు చేసి అనంతరం పోలి స్వార్గానికి పంపే వేడుకను మహిళలు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తారు. తెల్లవారుజామునే లేచి స్నానాలు ఆచరించి, అరటి దొప్పలతో దీపాలను వెలిగిస్తారు. వాటిని సమీపంలో ఉన్న నదిలో, చెరువులో లేదా ఇతర జలవనరుల్లో వదిలి పెడతారు. ఆ అవకాశం లేని వారు ఇంట్లోనే లోతుగా ఉన్న పెద్ద పళ్లాల్లో నీరు పోసి, వాటిలో దీపాలు విడిచి పెడతారు. పోలిని లక్ష్మీ స్వరూపంగా ఆరాధిస్తారు. కాబట్టి కార్తీక అమావాస్య రోజుకు బదులు ఆ మరుసటి రోజు, అంటే మార్గశిర శుద్ధ పాడ్యమినాడు పోలి పేరిట దీపాలను వెలిగిస్తారు. పోలి కథను చెప్పుకుంటూ ఆ దీపాలను నీటిలో వదులుతారు.



మందలపర్రు పంచాయతన క్షేత్రంలో కొలను వద్ద దీపాలు వెలిగిస్తున్న భక్తులు



పంచాయతన క్షేత్రంలో పోలిని స్వర్గానికి పంపే ముందు దీపాలతో పూజలు

30 వత్తుల దీపం



కార్తీకమాసం నెలంతా దీపాలు వెలిగించడం పుణ్యప్రదం. అలా చేయలేనివారు 30 వత్తులతో దీపాల్ని వెలిగించి, నీటిలో విడిచిపెడితే, నెలరోజులూ దీపాలు వెలిగించిన ఫలితం వస్తుందని పెద్దలుచెబుతారు. దీపాలను, స్వయం పాకాన్నీ దానం చెయ్యడంవల్ల విశేష ఫలం లభిస్తుందంటారు.

– చక్రవర్తుల సుబ్బారావు, అర్చకులు, అడవికొలను

పవిత్రమైనది పోలి స్వర్గం నోము



కార్తీకంలో పోలి స్వర్గం నోమును మహిళలు భక్తిశ్రద్ధలతో ఆచరిస్తారు. ఈ కథ అచ్చంగా తెలుగువారి కథ. కార్తీకంలో దీపం ప్రాధాన్యతే కాదు, ఈ ఆచారాన్ని పాటించాలని సూచించే గాథ ఇది. అశ్వయుజ అమావాస్య మొదలు కార్తీక అమావాస్య వరకూ ప్రతి నిత్యం బ్రహ్మీ ముహూర్తంలో దీపం వెలిగించి పోలి కథ చెప్పుకుని అక్షింతలు తలపై వేసుకోవడం అనవాయితీగా వస్తుంది.

– వెలవలపల్లి నాగలక్ష్మి, మందలపర్రు

పుస్తక పఠనంతో బంగారు భవిష్యత్తు

భీమడోలు: విద్యార్థి దశ నుంచి పుస్తక పఠనాన్ని అలవర్చుకుని ఉన్నత స్థితికి చేరుకోవాలని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ అన్నారు. భీమడోలు, గుండుగొలను, పూళ్ల శాఖా గ్రంథాలయాల్లో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమాలు ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా భీమడోలు శాఖా గ్రంథాలయంలో బాలబాలికలతో మండే సుధాకర్, గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమాల్లో గ్రంథపాలకులు డీఎస్‌బీ అమర్‌నాథ్, జి.నాగమణి తదితరులు పాల్గొన్నారు.